# జానకి బొమ్మలకొలువు

శ్రీమతి పాకల శ్రీలక్ష్మీకామేశ్వరమ్మగారు

సీతారామారావుగారికి కొమార్తె ఒకతే. తండ్రికి తల్లికి జానకిఅంటే ఎంతో ముద్దు. పదవయేటనే పెండ్లి చేశారు జానకికి. ప్రతీఏటా దసరాకి వాళ్లయింట్లో జానకి, జానకి మేనమామకూతురు కాంత కలిసి బొమ్మల కొలువుపెట్టారు. దసరా ఇంకాపది హేనురోజులు వున్నదనగానే ఖద్దరుపైటపావళ్లు, జాకెట్లు కుట్టించుకుంది జానకి వాళ్లనాన్నతో చెప్పి. ఆబట్టలు, అత్తవారుచేయించిన మువ్వలవడ్డాణం, అత్తవారు శ్రావణపట్టీతో పంపిన వాచీగొలుసు పెట్టుకొని ఎప్పుడు కొలువుపిలుపుకి బయలుదేరుదామా అని ఆదుర్దాపడుతోంది జానకి. మేనమామకూతురితో ఇల్లాఅంది: "కాంతా! నిరుడు మనకొలువుచూచి సీత బాగులేదని నవ్విందికదూ? అందరితోను, మనంపెట్టినకొలువుబాగులేదనీ, నాకు తనకు ఉన్నన్ని బొమ్మలులేవనీ చెప్పిందట. ఈసారి అది ఉడుక్కునేటట్టు కొలువుపెడదాం మనం. ఏం?"

... ... ... ...

జానకి నాయనమ్మ సుభద్రమ్మ వసారాలో కూర్చొని అప్పడాలువత్తుతోంది. ఇంట్లోకి జానకివచ్చింది.

జా:—నాయనమ్మగారూ! నాకు బొమ్మలకొలువుకి బొమ్మలు చాలవండీ. నిరుడు సీతపెట్టినకొలువు ఎంతో బాగుంది. గదినిండా బొమ్మలతో నింపేసింది. అన్నీదొరసానిబొమ్మలే. నేనుపెట్టిన కొలువుచూచి నవ్వింది. నాకేమీ బొమ్మలులేవనీ, నాకొలువుబాగాలేదనీ అందరితో చెప్పింది. నన్నుచూస్తే సరి నవ్వుతుంది. ఈసారి అది ఉడుక్కునేటట్టు పెడ్తాను కొలువు. నాన్నతో చెప్పరూ? అన్నయ్యకి బొమ్మలకోసం వ్రాయమని.

సు:—అలాగేచెబుతాను. నాన్నరాగానే చెప్తా. సీత నిన్నుచూస్తే నవ్వుతుందని చెప్పేవు. నవ్వితే నవ్వనీ. దానిమాటేపంకర. దాన్నినాదగ్గిరకు తీసుకురాలేకపోయావూ? నాలుగుచీవాట్లుపెడుదును. వెళ్లు నాన్న వచ్చేడేమో చూడు.

... ... ... ...

జానకికి ఇప్పుడుపదకొండో సంవత్సరం. సెకండుఫారం చదువుతుంది. ఈఏడుతో చదువుమానిపించెయ్యమని సుభద్రమ్మ సీతారామారావుతో చెప్పింది. కాని ఆయనకుమాత్రం కూతురికి మెట్రిక్యులేషన్ వరకూ చెప్పించాలనివుంది. జానకితల్లి విశాలక్ష్మికికూడా అదేఇష్టం. అందుచేత సుభద్రమ్మగారిమాటలు వినలేదు సీతారామారావు.

... ... ... ...

సు:—సీతారామం! చూచావూ? జానకికి, కొలువుపెట్టడానికి బొమ్మలుచాలవట. వాళ్లఅన్నకివ్రాసి తెప్పించమని నీతో చెప్పమని నాకు ప్రొద్దుటనుండీ ప్రాణంతీసేస్తుంది.

సీ:—(నవ్వుతూ) జానకీ! ఇలారా.

జానకి తండ్రి పిలువగానే వెళ్లి తండ్రిఒడిలోకూర్చుంది.

సీ:—జానకీ! ఏం! నాయనమ్మదగ్గిర అల్లరిచేస్తున్నావట. బొమ్మలుకావాలీ?

జా:—దొరసానిబొమ్మలుకావాలి నాన్నా! నాకు నిరుడుబొమ్మలపరీక్షలో దొరసానిబొమ్మఇచ్చేరే? అలాంటివి కావాలి.

సీ:—అలాగే. మీఅన్న ప్రభాకరం పట్నంలో ఉన్నాడుకదూ? ఎన్నికావాలంటే అన్ని తెస్తాడు. వెళ్లేటప్పుడు ప్రభాకరం ఏంచెప్పేడు నీతో? ఈపరీక్షలలో బాగా మార్కులుతెచ్చుకుంటే నీకుపట్టుచీరలు

తెస్తానన్నాడుకదూ? బాగాచదువుకుంటే ఎన్నికావాలంటే అన్నీ తెప్పిస్తాను. తప్పకుండా ఈరోజే వ్రాస్తాను అన్నయ్యకిబొమ్మలు తెమ్మని. అన్నయ్యా, వదినా వస్తారుగా దసరాకి? అప్పుడు తెస్తారు.

... ... ... ...

జానకి మంచి తెలివిగల అమ్మాయి. ఈడుకిమించిన తెలివి. ప్రతీఏటా ప్యాసుఅవుతోంది స్కూల్లో. పరీక్షలలో బాగా అందరికంటే ఎక్కువగా మార్కులువచ్చేయి. తనకి బాగామార్కులువచ్చేయని జానకి స్వయంగా వ్రాసింది వాళ్లన్నకి.

... ... ... ...

"జానకీ! జ్ఞాపకంఉందా? మరిచిపోయావా?" అని అప్పుడే రైలునుండివచ్చి బండిదిగుతూ సీతారామా రావుగారికోడలు కమల అన్నది. జానకి కమలదగ్గిరకు నవ్వుతూ వెళ్లింది.

"పిల్లవాడుబాగున్నాడా? ఇప్పుడేంజబ్బులేదుకదా?" అంటూ సుభద్రమ్మ కమలదగ్గిరఉన్న పిల్లవాడిని తీసికొని ఎత్తుకుంది.

"ఇంతచిక్కిపోయావేం? మరీనూ? బలానికేదైనా టానిక్ తీసుకుంటున్నావా?" అంటూ కమల చెయ్యిపట్టుకొని లోపలికి తీసుకువెళ్లింది అత్తవిశాలక్ష్మి.

వీళ్లంతా ఈసందడిలో ఉంటూండగా కమలావాళ్లు తెచ్చిన సామానంతా పరీక్షచేయసాగింది జానకి. ఎందుకూ? అందులో తనబొమ్మలపెట్టె ఎక్కడఉన్నదో అని.

"జానకీ! బొమ్మలు నాదగ్గిరఉన్నాయి. ఇలాగురా" అని ప్రభాకరరావు పిలిచేడు చెల్లెలిని.

జా:—ఎక్కడఉన్నాయి అన్నయ్యా! బొమ్మలూ?

ప్ర:—అదుగో ఆపెట్టెలోఉన్నాయి. నీవు ఈపరీక్షలో బాగా మార్కులు తెచ్చుకున్నావని వ్రాశావు? ఎప్పుడూఅలాగే మార్కులుతెచ్చుకోవాలి. నీకోసం మీవదిన పట్టుచీరలు లోలక్కులు తెచ్చింది. వెళ్లు. మీవదినను అడుగు. నాకు స్నానానికి వేళయింది. స్నానంచేసివచ్చి బొమ్మలుఇస్తాను.

పట్టుచీరలు, లోలక్కులుఅనగానే జానకికి సంతోషంఅయిందిగాని, బొమ్మలకన్నా ఇవి ముఖ్యంకావు జానకికి. "ఎప్పుడెప్పుడు బొమ్మలుచూస్తానాఅని అనుకుంటుంటే ఇంకాఎప్పుడో స్నానంచేసి వచ్చిచూపిస్తాడట" అని గొణుక్కుంటూ లోపలికివెళ్లింది జానకి.

... ... ... ...

లోపల కమల పిల్లవాడికి పాలుపడుతోంది.

జా:—వదినా! నాకోసం పట్టుచీరలు, లోలక్కులు తెచ్చేవని అన్నయ్యచెప్పేడు. ఏవీ? (అని సిగ్గుతో అడిగింది.)

క:—అవును. తెచ్చేను. ఆపెట్లోఉన్నాయి. ఇదిగోతాళాలు. పెట్టెతీసిచూడు.

జా:—తొందరలేదు. చూస్తాను. (పిల్లడివైపు చేతులుచాపి) బాబూ? నాదగ్గిరకురావూ?

క:—వెళ్లురా? అత్తకదూ? వెళ్లి తేబంగారం అంటుకుంటుందేమిటి?

జా:—ఉండు వదినా! ఒకమంత్రంవేస్తాను (అంటూ గదిలోకివెళ్లి బీరువాతీసి, పిప్పరమెంట్లుతీసి పిల్లవాడికి ఇచ్చింది.) చూశావు వదినా? ఇప్పుడు నాదగ్గిరకువచ్చేడు.

క:—ఇప్పు డెలాగురా వెళ్లేవు?

... ... ... ...

ఇంతలో ప్రభాకరరావు స్నానంచేసి రావడంచేత అతనిదగ్గరకువెళ్లింది జానకి.

ప్ర:—ఇవిగో బొమ్మలు. పెట్టెనిండా తెచ్చేను. బాగున్నవా?

జా:—(వాటిని చూస్తూ) బాగున్నవన్నయ్యా! ఇవన్నీ కొలువులో పెడితే ఎంతో బాగుంటుంది. (అని శాంతాన్ని పిలుచుకురావడానికి వెళ్లింది.)

శాంత, జానకి ఆబొమ్మలు చూచి, కొలువు పెట్టేటప్పుడు ఆబొమ్మలు ఎలాగు పెట్టవలెనో అనుకుంటూ ఆరాత్రిఅంతా వేగించారు.

... ... ... ...

సీత:—శాంతా! మీజానకికి వాళ్లన్న మంచిదొరసాని బొమ్మలు తెచ్చేడట నిజమేనా?

శాంత:—అబ్బా! ఎంతమంచి బొమ్మలనుకున్నావు? చూడడానికి రెండుకళ్లూ చాలవే? పాపం జానకికి బొమ్మలు లేవని వెక్కిరించేవు కాని, నీబొమ్మలకు మించినట్లున్నాయి.

సీత:—ఆ! అలాగా? (అని ముఖం ముడుచుకు వెళ్లిపోయింది.)

... ... ... ...

మర్నాడు జానకి, శాంత, కమల ఒకగదిలో బల్లలు వేసి, గుడ్డలు పరిచి కొలువు పెట్టేరు. కమలకూడా వాళ్లతో కలిసి కొలువు ఎలాగు పెట్టవలెనో అలాగు పెట్టడం చేత కొలువుగది బాగా వెలుగుతోంది.

జానకి తల్లితో చెప్పి కొలువు చూడడానికి వచ్చినవాళ్లందరికీ ఇవ్వడానికి రస్కాయపుండలు, అరటి పళ్లు, ఆకులు, చెక్కలు, గంధం, పన్నీరు అన్నీ సిద్ధం చేసింది.

మర్నాడు ప్రొద్దుట పదిగంటలకల్లా జానకికి, శాంతానికి కమల వరుసగా జడలు వేసి పట్టుచీరెలు కట్టించి నగలు పెట్టి ముస్తాబు చేసింది. అన్నట్టు చెప్పడం మరచిపోయాను. తాను తెచ్చిన లోలక్కులు కూడా పెట్టింది జానకికి కమల.

"నాయనమ్మగారూ? ఇక మేం పిలుపులకి వెళ్లుతున్నాం" అన్నది జానకి.

సుభ:—ఇలా రా జానకీ! ఏమిటా హడావిడి? ఇలా రా చూస్తాను. మెడలో ఏమిటి నగలు వేసుకున్నావ్? మెడనిండుగా లేదే! అచ్చే ఒక్క వాటీగొలుసేనా వేసుకున్నావు? నీకంటె వేసుకున్నావు కావేమి? వేసుకో. నామిరియాల పేరుకూడా వేస్తాను, రా.

జా:—వద్దండీ! నాయనమ్మగారూ! అది వేసుకుంటే అసహ్యంగా ఉంటుంది.

సు:—చూశావే? విశాలక్ష్మీ! మెడనిండుగా లేదని దానికంటె నామిరియాలపేరు వేసుకోమంటే వేసుకోదట. నేను చెపితే వినదు. నీవేనా చెప్పు.

వి:—(నవ్వుతూ) అలాంటివి ఇప్పుడెవరూ వేసుకోరత్తగారూ!

సు:—సరే బాగుంది నాలుగు చీవాట్లు పెట్టి వేసుకోమనాలిగాని, ఫలానివారిపిల్లకి నగలేమి లేవంటే ఎవరికి అప్రతిష్ఠ? ఇదేమి పాడుకాలం వచ్చిందమ్మా. ఎక్కడికైనా పిలుపులకి వెళితే చక్కా వంటినిండా నగలు పెట్టుకొని వెళ్లుతారుగాని ఎక్కువ నగలు పెట్టుకుంటేకూడా మోశైపోతుందా? ఇప్పటివేషాలన్నీ చూస్తే నాకు కళ్లుమండుతుంది.

జా:—ఫర్వాలేదు నాయనమ్మగారూ! ఎవ్వరూ ఏమీ అనుకోరు లెండి. మాకు వేళయిపోతుంది. వెళుతున్నాం (అని వెళ్లుదురు).

సు:—పోనీ మీఅమ్మకాసులపేరైనా వేసుకోవే (అని గట్టిగా కేకవేసింది)

సుభద్రమ్మగారి మాటలు వినిపించుకోకుండా వెళ్లిపోయారు.

... ... ... ...

జానకి:—వదినా! ఆబొట్టుభరిణ ఇలాతీసుకురా.

శాంత:—నేనుగంధంరాస్తాను జానకీ!

లక్ష్మి:—(సీతచెవిలో) జానకిపెట్టిన కొలువు ఎంతబాగుందో చూశావు?

పార్వతి:—(సీతచెవిలో) జానకికి వున్నలాంటి బొమ్మలు మనదగ్గిర ఎవళ్లదగ్గిరలేవు.

ఇంతలో జానకి వెండిపళ్లెంతో రస్కూరావుండలు అన్నీ వేసుకొనివచ్చి కమల అందరికీ బొట్టుపెడితే; శాంత గంధం, పన్నీరు, రాస్తే; తాను అత్తరూ, ఆకులూ, చెక్కలూ, రస్కూరావుండలూ, అరటిపళ్లూ అందరికీ ఇచ్చింది.

తరువాత జానకి గ్రామఫోను పెట్టి రామనాథశాస్త్రిగారి ప్లేట్లు పెట్టింది. తరువాత అందరూ తలకొక పాట పాడేరు. కాని ఇవన్నీచూచి సీత ఉడుక్కుపోయి ఎప్పుడెప్పుడు అక్కడనుండి లేచిపోదామా అని చూస్తూఉంది.

శాంత:—సీతా! ఈసారిఎలాగుఉందే మాకొలువు?

ఈమాటవినగానే సీత ఏడుపుమొఖంపెట్టుకొని ఎవ్వరితో చెప్పకుండా చివాలునలేచి వెళ్ళిపోయింది వాళ్ళఇంటికి.

# నీవులేకున్న నాయున్కి నీరసంబు

శ్రీమతి ఆర్. శారదగారు

శ్రీ హరీంద్రనాథచట్టోపాధ్యాయుని గీతమునకు అనువాదము

ముద్దువన్నెలం దఱఁగినపువ్వువోలె
రమ్యలహరీవిహీనవారాశివోలె
బరువుగలవాజిలేని సంగరమువోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

ఆతతసుఖంబు తఱఁగినగీతివోలె
వాగురవిహీనుఁడౌ బెస్తవానివోలెఁ
గనగలంగరుల్ లేనినౌకలనుబోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

దంబగుకవాటహీనసౌధంబువోలె
గమ్మమాధురి తఱఁగుఫలమ్మువోలెఁ
బక్షరక్షణ మెఱుఁగనిపక్షివోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

మిసిమిగలపృథ్వి లేనియాకసమువోలెఁ
బ్రాణతతిఁగోలుపడుశరీరంబువోలె
మృదుజలకణరహితవారిదమువోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

ఘననినదశూన్యమౌమృదంగంబువోలె
మేలిమెఱుఁగుల విడనాడుమెఱుపువోలెఁ
గసదతులకాంతిలేని ఖడ్గంబువోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

పరమగ్రంథవిహీనుఁడౌగురువువోలెఁ
బయనమునఁ ద్రోవదప్పినపాంథువోలె
సంతమెఱుఁగనిసంతతచింతవోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

ప్రియులసందేశమెఱుఁగనిప్రియులవోలె
సంధకారము తెలియనియన్నువోలె
నిమ్ముమినుకులులేని దీపమ్మువోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.

నాగసర్పము లేని కాననమువోలె
వహ్ని లేకున్న యగ్నిపర్వతమువోలె
సౌమ్యసంగీతరసమేదుజలధివోలె
నీవులేకున్న నాయున్కి నీరసంబు.